క్లుప్తంగా

శ్రీనివాస్‌గౌడ్‌కు సేవానంది ప్రతిభా అవార్డు



పామర్రు: హైదరాబాద్‌కు చెందిన అల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీవారు సేవానంది ప్రతిభా అవార్డును అందజేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ ఆదివారం తెలిపారు. ఆల్ ది బెస్టు ఆర్ట్స్ అకాడమి ఎల్లర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షులు జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య, జస్టిస్ ఎంఎస్‌కె జైస్వాల్‌లు సికింద్రాబాద్‌లోని కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్‌లోని శాంతి ఆడిటోరియంలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నట్లు శ్రీనివాసగౌడ్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ మానవ వనరుల అభివృద్ధి శాఖలచే సామాజిక కార్యకర్తగా గుర్తింపు పొందినందుకు అకాడమీ తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాసగౌడ్‌ను జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు రాజులపాటి రామచంద్రరరావు, ఉయ్యూరు నగర పంచాయతీ కౌన్సిలర్లు జంపాన పూర్ణిమ, రాజులపాటి నాగేంద్రప్రసాద్, సమాచార హక్కు చట్టం కార్యకర్త బేతపూడి జోగేశ్వరరావు, తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మి తదితరులు అభినందించారు.

రేపు మండవల్లిలో వైఎస్సార్ సీపీ సమావేశం

మండవల్లి: ఈనెల 10వ తేదీ మంగళవారం సాయంత్రం మూడు గంటలకు మండవల్లి మార్కెట్ యార్డ్‌లో వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

వాకర్స్‌కు ఆరోగ్య ఫిట్‌నెస్ పరీక్షలు



గుడివాడ టౌన్:ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 250 మంది వాకర్స్‌కి హెల్త్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వాకర్స్‌కు ఉచితంగా న్యూట్రీషియన్ హెల్త్ డ్రింక్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, కోశాధికారి డి.రామకృష్ణ, సభ్యులు ఎలిశ వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, జి.వెంకటేశ్వరరావు, బొగ్గారపు తిరుపతయ్య, బొప్పన కుటుంబరావు, ఎల్.చిట్టిబాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సూర్యనారాయణ స్వామి కల్యాణం



అవనిగడ్డ: మండల పరిధి వేకనూరులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లంక వెంకట గోపాలకృష్ణమూర్తి–వెంకట రాజ్యలక్ష్మి దంపతులు స్వామి వారి కల్యాణం జరిపించారు. అంబటి భరత్‌రామ్ అన్నప్రసాద కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించారు. ఆలయ ధర్మకర్త తుంగల వీర వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

12 మంది రైతులకు ఆవుల పంపిణీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని దేశాయిపేట బృందావన్ గోసంరక్షణ సంఘంలోని 12 ఆవులను ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఆదివారం పంపిణీ చేశారు.ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు 20 దేశీ ఆవులను ఇచ్చేందుకు గో సంరక్షణ సంఘం కమిటీ తీర్మానించడంతో ఈ ఆవులను రైతులకు పంపిణీ చేశారు. మచిలీపట్నం, పామర్రు, పెడన మండలాలకు చెందిన రైతులకు ఆవులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గో సంరక్షణ సంఘం అధ్యక్షుడు గున్నయ్యశెట్టి, శేఖర్, ఓ స్వామిబాబు, దామ్మోహన్, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న పేదల సొంతింటి కల




మల్లివాడ జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

- శరవేగంగా జగనన్నకాలనీల నిర్మాణం
- డ్వాక్రా రుణం రూ.35వేలు.
- బ్యాంకు రుణం రూ.3లక్షలు
- పనులు జరిగిన వెంటనే బిల్లుల చెల్లింపు

పమిడిముక్కల: పేదల సొంతింటి కల నెరవేరుతోంది. గతంలో వైఎస్సార్ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి ఇళ్లు కట్టించగా, ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వడంతో జగనన్న కాలనీల పేరుతో ఇళ్లనిర్మాణం చేపట్టడంతో కొత్తగా ఊళ్లకు ఊళ్లే వెలుస్తున్నాయి.

43లేఅవుట్లు..2149మందికి స్థలాలు..

మండలంలో మొత్తం 25 గ్రామాల్లోని పేదలందరికీ 21 గ్రామాల్లో పేదలకు స్థలాలు ఇచ్చారు. మిగిలిన నాలుగు గ్రామలైన గోపువానిపాలెం, అమీనపురం, ముళ్లపూడి, ఐనంపూడి గ్రామాల్లో భూసేకరణకు ప్రతిపాదనలు పంపారు.జగనన్న కాలనీల కింద 21 గ్రామాల పరిధిలో 43లేఅవుట్‌లలో 2149 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. మల్లివాడ, గురజాడ, మంటాడ, కపిలేశ్వరపురం, పమిడిముక్కల, కృష్ణాపురం, ఫత్తేలంక గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయి.

193గృహాలు పూర్తి..

ఇప్పటికే 523 మంది ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించగా, ఇప్పటికే 193 గృహ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన గృహాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఒక్కో ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.30వేలు ఇస్తోంది. బేస్ లెవల్‌కు రూ.70,000, ఆర్ఎల్‌కు రూ.36,800లు, ఆర్సీకు రూ.22,000, ఇంటి నిర్మాణం పూర్తయితే రూ.22,000, ఉపాధి పని దినాలు 90 రోజులకు రూ.30,000 చొప్పున లబ్ధిదారులకు చెల్లిస్తున్నారు. గృహనిర్మాణ శాఖ నుంచి సిమెంట్, ఇసుక, విద్యుత్ సామాగ్రి, ఇండోర్ ఫ్రేములు అందజేస్తున్నారు. దీంతో మిగిలిన లబ్ధిదారులు కూడా నిర్మాణ పనులు ప్రారంభించుకునేందుకు ఆసక్తిచూపుతున్నారు. సొంత స్థలాలు ఉన్నవారికి 1280 మందికి ఇళ్లు మంజూరు కాగా 884 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన గృహాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పనులు జరిగిన వెంటనే బిల్లులు పడుతుండటంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపుతున్నారు.

బ్యాంకు రుణం రూ.3లక్షలు..

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఇచ్చే మొత్తానికి అదనంగా అర్హులైన లబ్ధిదారులందరికీ ఇంటి నిర్మాణం కోసం బ్యాంకుల నుంచి రూ.3లక్షల వరకు రుణ సదుపాయం లభిస్తోంది. దీంతో అద్దె ఇళ్లు, ఉమ్మడి కుటుంబంలో ఇరుకుగా ఉండే ఇళ్లలో ఉండే పేదలంతా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభించి త్వరితగతిన పనుల పూర్తిచేసుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమాని సొంతింటికల నెరవేరుతోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మా కల నెరవేరింది..



ఇల్లు కట్టుకోవాలనే మా కల నెరవేరుతోంది. గత ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వలేదు. ఇళ్ల స్థలాల కోసం నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చే ఆర్థికసాయంతో మరికొంత నగదు వేసుకుని ఇల్లు కట్టుకుంటున్నాం. సొంతింటి కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది.

– ముదునూరి సలోమి, లబ్ధిదారు, హనుమంతపురం

జగనన్నకు కృతజ్ఞతలు...



మాలాంటి పేదలకు సొంతింటి నిర్మాణం ఏళ్లకు ఏళ్లుగా కలగానే ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించే సాయానికి తోడు మరికొంత కలుపుకుని ఇల్లు కట్టుకుంటున్నాం. ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– బోయి కనకమ్మ, లబ్ధిదారు, మంటాడ

శరవేగంగా ఇళ్ల నిర్మాణం..



మండలంలో జగనన్న కాలనీలు, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణపు పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిర్మాణం ప్రారంభించిన ఇళ్లకు వివిధ దశల్లో వెంటనే బిల్లులు చెల్లిస్తున్నాం. డిశంబర్‌కు మరో వెయ్యి ఇళ్లు మంజూరవుతాయి. సచివాలయ ఇంజినీరింగ్ విభాగం అధికారులు కూడా సహకారం అందిస్తున్నారు. ఇళ్లస్థలాలు పొందినవారంతా గృహాలు నిర్మించుకోవాలి.

– గంటాల భవానీప్రసాద్, ఏఈ, హౌసింగ్

బాధితుడికి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుల ఆర్థికసాయం



అడ్డాడ(పామర్రు): ఇటీవల మృతిచెందిన అడ్డాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గుంటూరు వెంకటేశ్వరరావు దశదిన కర్మల నిర్వహణకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ రూ.6వేలను ఆర్థికసాయంగా అందజేశారు. వెంకటేశ్వరరావు భార్య గతంలోనే మృతిచెందడంతో పదోతరగతి చదువుతున్న వారి కుమారుడు చిన్ను ఒంటరివాడయ్యాడు. ఈనేపథ్యంలో వెంకటేశ్వరరావుకు సోమవారం దశదినకర్మలు నిర్వహించేందుకు సైతం నగదు లేకపోవడంతో తనకు ఆర్థికసాయం చేయాలని చిన్ను, ఎమ్మెల్యేను కోరగా ఆయన రూ.6వేలను అందజేశారు. అదేవిధంగా అడ్డాడ సర్పంచ్ పామర్తి త్రినేత్రి, ఎంపీటీసీ నాగమల్లేశ్వరరావు, స్థానిక పెద్దలు ఆర్థికసాయం అందించారు. దశ దిన కర్మకు కావాల్సిన వస్తువులను మృతుని కుమారుడు చిన్నుకి అందజేశారు. ఈ సందర్భంగా పామర్రు వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి స్పందించి చిన్ను చదువుకు అయ్యే ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, గ్రామస్తులు పామర్తి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త జీవితం అందరికీ ఆదర్శప్రాయం



మాట్లాడుతున్న హిమాయితుద్దీన్

పామర్రు: మహమ్మద్ ప్రవక్త జీవితం అందరికీ ఆదర్శప్రాయమని జమాఅతె ఇస్లామీరాష్ట్ర సలహా మండలి సభ్యులు హిమాయతుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక జమాఅతె ఇస్లామి హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త ముహమ్మద్(స) జయంతి నెలను ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా హిమాయతుద్దీన్ మాట్లాడుతూ పరిశీలనాత్మక దృష్టితో మహనీయుల జీవితాలను చదవాలని సూచించారు.అప్పుడు మాత్రమే అన్ని మతాల్లోని మంచిని గ్రహించగలమని పేర్కొన్నారు. కార్యక్రమానికి యూనుస్ అధ్యక్షత వహించగా, పామర్రు ఎంఈవో–2 పద్మవాణి, స్థానికులు రాజేశ్వరి, శ్రావణి, తహసిన్ అస్మా, మున్నీ, అమ్మారా, మల్లిక, రెహానా పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాయం



చల్లపల్లి: పేద విద్యార్థులకు ఎంఏ ఖాదర్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.75 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం ట్రస్ట్ ప్రతినిధి, విశ్రాంత ఉపాధ్యాయులు మహ్మద్ జహీరుద్దీన్ ఇంటి వద్ద పది మంది పేద విద్యార్థులకు రూ.75 వేలు ఆర్థిక సాయం చేశారు. గ్రామంలోని ఎస్సార్‌వైఎస్సీ హైస్కూల్, జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ ఎంపీపీ ఉర్దూ పాఠశాల, విజయా హైస్కూల్‌లో చదువుతున్న పేద విద్యార్థులకు ఈ సహాయం అందజేశారు. ట్రస్ట్ కార్యదర్శి మహ్మద్ నసీరుద్దీన్ మాట్లాడుతూ చల్లపల్లిలో చదువుకున్న ఖాదర్‌ఖాన్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు అమెరికాలో ఉంటున్నప్పటికీ, చల్లపల్లిలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేయాలనే తలంపుతో తండ్రి పేరు మీద పదేళ్లుగా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ



రూ.2.96 కోట్లతో నిర్మించిన తమిరిశ బీటీ రోడ్డు



రూ 1.50 కోట్లతో నిర్మించిన నందివాడ–కుదరవల్లి రోడ్డు

- నందివాడ మండలంలో రూ.9.46 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు
- రూ.4.76కోట్లతో పలు రోడ్ల పనులు పూర్తి
- మరో రూ.4.70కోట్ల నిధులు మంజూరు
- త్వరలో పిలువనున్న టెండర్లు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండల పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ పట్టింది. గత పాలకులు గ్రామీణ రోడ్లనిర్మాణానికి తగిన చర్యలు తీసుకోకపోవడంతో గోతులమయమైన రోడ్లతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది.మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం కోసం రూ.9.46కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో ఓ క్రమపద్ధతిలో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్ల నిర్మాణపు పనులు చేపట్టి, త్వరితగతిన పూర్తిచేస్తున్నారు.

నందివాడ–కుదరవల్లి రోడ్డు పూర్తి..

తొలుత జనార్దనపురం, కుదరవల్లి రోడ్డు మరమ్మతు పనుల కోసం రాష్ట్రప్రభుత్వం రూ.30 లక్షలు ఖర్చు చేసింది.

అనంతరం నందివాడ నుంచి కుదరవల్లి వరకు రూ 1.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టింది. అదేవిధంగా ఏళ్లతరబడి అస్తవ్యస్తంగా ఉన్న గుడివాడ–పోలుకొండ రోడ్‌లోని అంబేద్కర్ నగర్, తమిరిశ మధ్యగల రెండున్నర కిలోమీటర్ల రోడ్డును రూ 2.96 కోట్లతో పునర్నిర్మించారు. ఇక పోలుకొండ నుంచి లక్ష్మీ నరసింహపురం మీదుగా కుదరవల్లి క్రాస్‌రోడ్ వద్దకు గల 13.35 కిలోమీటర్ల పొడవుగల రోడ్డు నిర్మాణానికి రూ.4.70 కోట్లు నిధులను మంజూరు చేసింది. ఈ రోడ్డు పనులకు సంబంధించి త్వరితగతిన టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి, పనులు పూర్తిచేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. ఇలా సుమారు రూ.10కోట్ల నిధులతో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం చేపట్టి, కొన్ని పనులు పూర్తి చేయడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

మా ప్రాంత ప్రజల కష్టాలు తీరాయి..



గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్, రోడ్డు పొడవున ఒకవైపు మూడు అడుగుల లోతులో గోతిని తవ్వి వదిలివేయడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రోడ్డు కుంగి ఉండటం, చేపల చెరువుల వద్దకు వచ్చే భారీ వాహనాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం రూ.2.96 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టడంతో మాప్రాంత ప్రజల కష్టాలు తీరాయి.

– తప్పెట ధనలక్ష్మి, సర్పంచ్, తమిరిశ

ప్రయాణం సజావుగా సాగుతోంది..



నందివాడ నుంచి మండల శివారు గ్రామమైన లక్ష్మీనరసింహపురం వరకు అన్ని గ్రామాల్లో చేపల చెరువుల సంఖ్య పెరిగిపోయింది. ఆయా చెరువుల వద్దకు వచ్చే భారీ వాహనాల కారణంగా రోడ్లు అధ్వానంగా మారినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.1.50కోట్లతో ఈ రోడ్డు పనులు పూర్తిచేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రయాణం సజావుగా సాగుతోంది.

– నత్తా మరియమ్మ, సర్పంచ్, ఇలపర్రు

15 నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



అర్థంకి నాంచారమ్మ అమ్మవారు

కోడూరు: కృష్ణానదిలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అర్థంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య ఆదివారం తెలిపారు. 15 నుంచి 23వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో ప్రతి రోజూ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 15న విశ్వనాథపల్లి భక్త సమాజంచే భజన కార్యక్రమం, 16న గుడివాడకు చెందిన పాదర్తి సిస్టర్స్ శిష్య బృందంచే జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శన, 17న గుంటూరు రాధామాధవ నాట్యక్షేత్రానికి చెందిన కళాకారులచే భరతనాట్య ప్రదర్శన, 18న విశ్వనాథపల్లి అభయాంజనేయ బృందంచే మురళీకృష్ణ కోలాటం, 19న జరుగువానిపాలెం శ్రీనివాసభక్త సమాజం సభ్యులచే భజన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 20న వి.కొత్తపాలెంకు చెందిన సీతారామాంజనేయ భక్తసమాజం సభ్యుల మురళీ కోలాటం, భజన కార్యక్రమం, 21న చినముత్తేవి వేణుగోపాల భక్తసమాజం సభ్యులతో అమ్మవారి గాన కచేరీ, 22న నూరగం రామకృష్ణ ఆధ్వర్యంలో రేలారే–రేలా జానపద కళాకారులతో గీతాలు, నృత్య ప్రదర్శనలు జరుగుతాయని ఈఓ వివరించారు. 23న శమీవృక్ష పూజ, అనంతరం కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ



లక్ష్మణరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, నాయకులు

పామర్రు: ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త, ఆర్ఎంపీ వైద్యుడు పరిశ లక్ష్మణరావును ఆదివారం పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. వైద్యుల సూచనలను తప్పకుండా పాటించాలని సూచించారు. లక్ష్మణరావును పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, మండల ఆర్బీకే చైర్మన్ ఆరుమళ్ల శ్రీనాథ్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీ సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, కూనం పెద వెంకటరెడ్డి, పరసా రాజబాబు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవుదినం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు స్వీకరించిన విద్యార్థులతో జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, సిబ్బంది

గన్నవరం రూరల్: విజ్ఞాన సాధనకు పుస్తక పఠనం ఒక్కటే మార్గమని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. ఆదివారం మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయానికి నీతి కథలు, స్టోరీ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కె.కృపానందం అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు. వేసవి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థులలోని సృజనను వెలికితీయడంతో పాటు, పుస్తక పఠనం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచారన్నారు. గ్రామస్తులు పార్థసారధి, వెంకట్రామయ్య, సుబ్బారావు, సీతారామయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

పెనమలూరు: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్స్ (ఏపీయూఎస్ఎంఏ) ఆధ్వర్యంలో ఆదివారం తాడిగడపలో జరిగిన కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన దాదాపు 20 మంది ఉపాధ్యాయులను సంఘం ప్రత్యేకంగా సన్మానించింది. పెనమలూరుకు చెందిన వికాసన్ పాఠశాల ఉపాధ్యాయుడు పెండ్యాల రాజేష్, జ్యోతి కాన్వెంట్ ప్రిన్సిపాల్ రాజులపాటి ఆదిశేషులను కమిటీ ఘనంగా సన్మానం చేశారు. సమాజంలో ఉపాధ్యాయులు పాత్రచాలా కీలకమని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కె.సాంబశివరావు, నరేంద్రకుమార్, వై.విజయ్ కుమార్, ఆర్ఎస్ఎన్ ప్రసాద్, కేఆర్ఎస్.రావు, చిగురుపాటి వివేకానంద పలువురు పాల్గొన్నారు.

19 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

పెనమలూరు: కానూరులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. తహశీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు కొత్త ఆటోనగర్‌లో 19 టన్నుల రేషన్ బియ్యాన్ని లారీలో అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు చేసి లారీని పట్టుకున్నారు. లారీలో 19 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని తహశీల్దార్ వెంకటశివయ్య తెలిపారు.

చిత్తులాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

ఘంటసాల(అవనిగడ్డ): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘంటసాల జగనన్న కాలనీలో చిత్తులాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. చిత్తులాట సమాచారం తెలుసుకున్న వెంటనే దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,660 నగదును స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా పేకాట, చిత్తులాట, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.